ముంపులో ఆత్రేయపురం పిహెచ్‌సి ఆవరణ

ముంపులో పిహెచ్‌సి ఆసుపత్రి ప్రాంగణం

ప్రజాశక్తి-ఆత్రేయపురం
భారీ వర్షాలకు మండలంలో గ్రామాల్లో పల్లపు ప్రాంతాలు జలమయం అయ్యాయి. రెండు రోజులుగా వాతావరణం పొడిగా ఉండడంతో పల్లపు ప్రాంతాలు కొద్దిగా తేరుకుంటున్నాయి. కానీ ఆత్రేయ పురం పిహెచ్‌సిలో ముంపు నీరు ముందుకు వెళ్లే దారి లేకపోవడంతో అలాగే ఉంది. ఈ నీటిలోనే రోగులు ఆసుపత్రికి వెళ్ళవలసి వస్తోంది. గతంలో కురిసిన వర్షం నీరు ఆసుపత్రి వెనుక భాగంలో చెరువులోకి వెళ్లేది. కానీ చెరువును పూర్తి పార్కింగ్ చేయడంతో చుక్కనీరు వెళ్లే పరిస్థితి లేక ముంపు నీటిలోనే ఆసుపత్రి ఆవరణ అంతా ఉంది. మండల కేంద్రం ఆత్రేయపురంలో డ్రెయినేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో ఈ దుస్థితి ఏర్పడింది.

ప్రజా సమస్యలకు చోటెక్కడ..?

ప్రజాప్రతినిధులు, కీలక అధికారులు డుమ్మా
తూతూ మంత్రంగా జడ్‌పి సమావేశం

జడ్‌పి సమావేశంలో మాట్లాడుతున్న జడ్‌పి ఛైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి
ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో వేధిస్తున్న కీలక సమస్యలను చర్చించి పరిష్కారానికి వేదికగా నిలవాల్సిన జిల్లా పరిషత్ సమావేశాలు ప్రతిసారీ మొక్కుబడిగానే జరుగుతున్నాయి. శుక్రవారం జరిగిన సమావేశం కూడా తూతూ మంత్రంగానే సాగింది. కీలక శాఖల అధికారులు, పలువురు ప్రజా ప్రతినిధులు హాజరుకాకపోగా, వచ్చిన వారు సైతం అరకొర అంశాలతో ముగించేశారు.

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా జడ్‌పి ఛైర్మన్ విప్పర్తి వేణుగోపాల్ అధ్యక్షతన జిల్లా పరిషత్తు సర్వసభ్య సాధారణ సమావేశం జరిగింది. షెడ్యూల్ ప్రకారం కాకుండా గంట ఆలస్యంగా సమావేశం ప్రారంభమైంది. 3 గంటల వ్యవధిలోనే మీటింగును ముగించారు. మూడు జిల్లాల నుంచి పూర్తిస్థాయిలో ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొనలేదు. దీంతో పలు సమస్యల ప్రస్తావనకే చోటు దక్కలేదు. మొత్తం వివిధ శాఖలకు సంబంధించి 35 అంశాలను పొందు పర్చగా వ్యవసాయం, ఇరిగేషన్, వైద్య ఆరోగ్య, డిఆర్‌డిఎ, పంచాయతీరాజ్ శాఖలకు చెందిన అంశాల చర్చకే పరిమితమయ్యారు. మూడు జిల్లాల్లో అనేక సమస్యలు వేధిస్తుండగా కొన్ని సమస్యలను మాత్రమే అరకొరగా చర్చించి ముగించారు.

రాజ్యసభ సభ్యులు పిల్లి సుభాష్ చంద్రబోస్, కాకినాడ జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సగిలి, తూర్పుగోదావరి జిల్లా జేసీ ఎస్.చిన రాముడు, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, అనపర్తి, రాజానగరం, కాకినాడ రూరల్, మండపేట, జగ్గంపేట ఎమ్మెల్యేలు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, బత్తుల బలరామకృష్ణ, పంతం నానాజీ, వేగుళ్ల జోగేశ్వరరావు, జ్యోతుల నెహ్రూ మాత్రమే పాల్గొన్నారు. ఉమ్మడి జిల్లాలో 19 మంది కాకినాడ, రాజమండ్రి సిటీల ఎమ్మెల్యేలు మినహా మిగిలిన 17 మంది హాజరు కావాల్సి ఉండగా ఐదుగురు మాత్రమే వచ్చారు. ముగ్గురు మంత్రులు, మూడు జిల్లాల ఎంపీలు కూడా హాజరు కాలేదు. కాకినాడ జిల్లా కలెక్టర్ మినహా మిగిలిన ఇద్దరు కలెక్టర్లుతో బాటు కీలక శాఖల అధికారులు సైతం వరదల కారణం చూపి సమావేశంలో పాల్గొనలేకపోయారు.

గౌరవ వేతనాలపై పట్టు
సమావేశం ప్రారంభం కాకుండానే పలువురు జిల్లా పరిషత్ సభ్యులు ప్రజా సమస్యలు చర్చకు రాకుండానే ప్రజాప్రతినిధులకు గౌరవ వేతనాలు, టిఎ, డిఎలపై ఛైర్మన్, సిఇఒలను నిలదీశారు. వారం రోజులు గడువు ఇవ్వాలని కలెక్టర్ కోరినా పెరగకపోతే సమావేశాన్ని బాయ్‌కాట్ చేసేందుకు సభ్యులు ప్రయత్నించారు. రెండేళ్లు గడిచినా గౌరవ వేతనాలు చెల్లించకపోవడంతో దారుణమన్నారు. సాధారణ నిధుల నుంచి చెల్లించాలని జడ్‌పి వైస్ ఛైర్మన్ బుర్రా అనుబాబు కోరారు. జడ్‌పిటిసి ప్రతిపాదించిన పనుల బిల్లులు పెండింగ్‌లోనే ఉన్నాయన్నారు. వీటిని పరిష్కారం చేయాలని కోరారు. ఎంపీ పిల్లి సుభాష్‌చంద్రబోస్ మాట్లాడుతూ సాధారణ నిధుల నుంచి వేతనాలు ఇచ్చే విధంగా తీర్మానం చేయాలని సూచించారు. మండపేట ఎంఎల్‌ఎ వేగుళ్ల జోగేశ్వరరావు కూడా వారికి మద్దతుగా నిలిచారు. సభ్యులు కోరుకున్న విధంగా గౌరవ వేతనం, టిఎ, డిఎల అంశంపై తీర్మానాన్ని ప్రవేశపెట్టి ఆమోదిస్తామని చైర్మన్ వేణుగోపాలరావు తెలిపారు. ఈ బకాయిలు సిఎఫ్‌ఎంఎస్ ద్వారా సభ్యుల ఖాతాల్లోనే జమయ్యే అవకాశం ఉందని జడ్‌పి సిఇఒ శ్రీరామచంద్రమూర్తి అన్నారు.

ఎంఎల్‌ఎలుజోగేశ్వరరావు, నల్లమిల్లి రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ రెండేళ్లుగా బకాయిలున్నాయి అప్పుడు ప్రశ్నించని సభ్యులు ఇప్పుడెందుకు ప్రశ్నిస్తున్నారని నిలదీశారు. జిల్లాలో ప్రకృతి వైపరీత్యాలు ఉన్నందున ప్రజా సమస్యలను చర్చించాలని ఎక్కువ సమయం కేటాయించాలని కోరారు. 15వ ఆర్థిక సంఘం నిధులను గత వైసిపి ప్రభుత్వం మాదిరిగా కాకుండా నేరుగా పంచాయతీలకు జమ చేశామన్నారు. సుద్దగడ్డ కాలువ వరద వలన గొల్లప్రోలు మండలంలో రైతులు, ప్రజలు తీవ్ర నష్టానికి గురవుతున్న నేపథ్యంలో శాశ్వత పరిష్కారం చూపే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని గొల్లప్రోలు జడ్‌పిటిసి లోవరాజు అధికారులను కోరారు. మిచౌంగ్ తుపానుతో నష్టపోయిన 547 మంది రైతులకు నేటికీ పరిహారం అందలేదని గుర్తు చేశారు. జ్యోతుల నెహ్రూ మాట్లాడుతూ కీలక సమస్యలను చర్చించాల్సిన జడ్‌పి సమావేశానికి పూర్తిస్థాయిలో ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరు కాకపోవడం శోచనీయమన్నారు. ఏటా వరదల వల్ల ముంపు బారినపడుతున్న నేపథ్యంలో అధికార యంత్రాంగం ముందస్తు చర్యలు తీసుకోవాలని కోరారు. జిల్లాలో రోడ్ల దుస్థితి అధ్వాన్నంగా ఉందని, తక్షణమే మరమ్మతులు చేయాలని సూచించారు. జగ్గంపేట నియోజకవర్గంలో ఉన్న తాళ్లూరు లిఫ్ట్ ఇరిగేషన్ మరమ్మతులను తక్షణమే చేపట్టి సాగునీరు అందించాలన్నారు. అరకొర అంశాలను మాత్రమే చర్చించి సమావేశాన్ని మమ అనిపించడంతో హాజరైన సభ్యులు పలువురు అసహనాన్ని వ్యక్తం చేశారు.

ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం
ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో సాగు నీటి వ్యవస్థలపై ఆక్రమణల తొలగించి ఆధునికీకరించేందుకు సమగ్ర కార్యాచరణ రూపకల్పనకు జడ్‌పి సమావేశం నిర్ణయించింది. గోదావరి బ్యారేజి, ఏలేరు రిజర్వాయర్ వివరాలను ఎస్‌ఇ బి.శ్రీనివాసరావు వివరించారు. ఏలేరు ఏటిగట్ల పటిష్టతకు రూ.కోటితో పనులు చేపడుతున్నామని, రూ.1000 కోట్ల అంచనాతో ఆధునికీకరణకు ప్రణాళిక సిద్ధం చేసి ప్రభుత్వానికి నివేదిస్తున్నామని జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ తెలిపారు. ఈ పనుల ప్రతిపాదనల్లో స్థానిక ఎంఎల్‌ఎ సూచనలను పరిగణలోకి తీసుకోవాలని, ఇందుకు ప్రత్యేక సమావేశం నిర్వహించాలని జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ కోరారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాల పరిధిలో సమావేశం నిర్వహించాలని ఎంఎల్‌సి తోట త్రిమూర్తులు, ఎంఎల్‌ఎలు కోరారు. ఆక్రమణ వల్లే ముంపు సమస్య ఎదురౌతోందని, వీటి తొలగింపుకు హైడ్రా తరహా చర్యలు జిల్లాలో కూడా చేపట్టాల్సి ఉందని ప్రజాప్రతినిధులు అందరూ కోరారు. 2018-19లో ధాన్య కొనుగోళ్లు జరిపిన మండల సమాఖ్యలకు కమిషన్ సొమ్ము చెల్లింపుపై వివరణ కోరారు. దీన్ని పరిశీలించి తెలియజేస్తామని కలెక్టర్ సమాధానం ఇచ్చారు.

ఆర్ఎస్ భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న సిపిఎం, ప్రజాసంఘాల నాయకులు

'ఆర్ఎస్' సేవలు చిరస్మరణీయం

- సిపిఎం జిల్లా కన్వీనర్ కారెం వెంకటేశ్వరరావు
- ఆర్ఎస్ అంతిమయాత్రలో పాల్గొన్న సిపిఎం, ప్రజా సంఘాల నాయకులు

ప్రజాశక్తి-అమలాపురం
సిపిఎం నాయకుడు రుద్ర రాజు సత్యనారాయణ రాజు(ఆర్ఎస్) సేవలు చిరస్మరణీయమని ఆ పార్టీ డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా కన్వీనర్ కారెం వెంకటేశ్వరావు అన్నారు. ఆర్ఎస్ మరణానికి సిపిఎం డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమజిల్లా కమిటీ తరఫున విప్లవ జోహార్లు అర్పిస్తున్నామని తెలిపారు. శుక్రవారం చించినాడ గ్రామంలో ఆర్ఎస్ అంతిమ యాత్రలో కారెం వెంకటేశ్వరావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కారెం వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఆర్ఎస్ సుమారు 13 సంవత్సరాలు చించినాడ సర్పంచిగా, ఎంఎల్ఎగా, సిపిఎం శాసనసభాపక్ష ఉప నాయకుడిగా, సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యునిగా, చించినాడ భూ పోరాట యోధుడిగా, ఆదివాసి హక్కుల యోధుడిగా, రైతు, కూలీ, కార్మిక ఇతర ప్రజాసంఘాల నాయకుడిగా, మార్గదర్శిగా సుమారు మూడు సంవత్సరాలు జైలు శిక్ష అనుభవించినా ఎక్కడా ఆత్మస్థైర్యాన్ని కోల్పోలేదన్నారు. ఉభయ గోదావరి జిల్లాల్లో ఆర్ఎస్ అంటే తెలియని వాళ్ళు ఉండరన్నారు. ముఖ్యంగా పశ్చిమ గోదా వరి జిల్లా చించినాడలో ఒక భూస్వామ్య కుటుంబంలో పుట్టి కడవరకు పేదలు, దళితుల అభ్యున్నతికై పోరాటం చేశార న్నారు. ఆర్ఎస్ కు కుంటుంబ సభ్యుల కు ప్రగాఢ సానుభూతిని తెలియ జేశారు. ఈ అంతిమయాత్రలో అంబేద్క ర్ కోనసీమ జిల్లా కమిటీ సభ్యులు జి.దుర్గాప్రసాద్, పీతల రామచంద్రరావు, నాయకులు సిహెచ్.సూర్యప్రకాశరావు, కందికట్ల, గిరిజా,బుంగ సత్య నారాయణ, తాడి శ్రీరామ్మూర్తి, పర్వతాలు పొలమూరి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

వాద్‌నగర్ పర్యటనకు ఇద్దరు విద్యార్థుల ఎంపిక

ప్రజాశక్తి-ముమ్మిడివరం
గుజరాత్‌లో వాద్ నగర్ పర్యటనకు అంబేద్కర్ కోనసీమ జిల్లాకు చెందిన ఇద్దరు విద్యార్థులు ఎంపికైనట్లు డిఇఒ ఎం.కమలకుమారి తెలిపారు. ఎయిమ్స్ ఇంజినీరింగ్ కళాశాల ప్రాంగణంలో డిఇఒ కార్యాలయంలో శుక్రవారం పెద్దాపురం జవహర్ నవోదయ విద్యాలయం ప్రిన్సిపల్ ఎం.కృష్ణయ్య బందం డిఇఒను కలిసి ప్రయాణ టికెట్స్ అందజేశారు. డిఇఒ మాట్లాడుతూ కేంద్ర ం ఆదేశాల మేరకు గత మేలో జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన ప్రేరణ పోటీల్లో ఇద్దరు విద్యార్థులు ఎంపికైనట్లు ఉత్త ర్వులు అందాయన్నారు. వీరిలో కె.గంగవరం మండలం దంగేరు జెడ్‌పి పాఠశాల విద్యార్థి మల్లిపూడి సాయి వెంకట గణేష్, మండపేట జవహర్ మున్సిపల్ హైస్కూల్ విద్యార్థిని శివ నవ్య శ్రీ ఉన్నారని అన్నారు. వీరికి సహాయ కులు(ఎస్కార్ట్) టీచర్‌గా ద్వార పూడి బాలికొన్నత పాఠశాల ఉపాధ్యాయిని కె.కళ్యాణి ఎంపికైనట్లు తెలిపారు. ఇద్దరు విద్యార్థులు సహాయక టీచర్(ఎస్కార్ట్) తో కలిసి ఈ నెల 19న వాద్ నగర్ వెళ్తారని, అక్కడ వారం రోజు ల పాటు పర్యటించి ఈ నెల 30న తిరిగి వస్తారన్నారు.

నిలకడగానే వరద నీటి ప్రవాహం

పెదపట్నంలో నాటు పడవలపై పశు గ్రాసం తరలింపు

కోరుమిల్లిలో ఒడ్డుకు చేరిన మత్స్యకారులు బోట్లు

ప్రజాశక్తి-యంత్రాంగం
ఎగువున కురుస్తున్న వర్షాలకు శుక్రవారం తగ్గుముఖం పట్టినా గోదావరి వరద నీటి ప్రవాహం నిలకడగానే ఉంది. పలు లంక గ్రామాలకు వెళ్లే రహదారులు జలదిగ్బంధంలో ఉన్నాయి.
మామిడికుదురు: గోదావరిలో వరద ఉధతి మరింత పెరగడంతో మండల పరిధిలో ఐదు లంక గ్రామాలు శుక్రవారం జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. పాశర్లపూడి కరకట్ట దిగువన మూడు లంక గ్రామాలకు వెళ్లే ప్రధాన ఆర్ అండ్ బి రహదారి వరద నీట మునిగింది. దీంతో అప్పనపల్లి, పెదపట్నంలంక, బి. దొడ్డవరం గ్రామాలకు బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోయాయి. కాజువే పై నాలుగు అడుగుల మేర వరద నీరు ప్రవహిస్తోంది. జూలైలో మొదటిసారి తాజాగా ప్రస్తుతం రెండవ సరి కాజ్వే ముంపునకు గురైంది. పాశర్లపూడి శ్రీరామ్‌పేట, పెదపట్నం రత్నాపురం వరద నీట మునిగాయి. పెదపట్నంలో మధ్యలంకలో. నుంచి నాటు పడవలపై పశుగ్రాసం తరలిస్తూ రైతులు అవస్థలు ఎదుర్కొంటున్నారు. పి.గన్నవరం మండల పరిధిలో గత రెండు రోజుల నుంచి ఐదు లంక గ్రామాలు జలదిగ్బంధంలో చిక్కుకోవడంతో బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోయి నాటు పడవల ద్వారా రాకపోకలు సాగిస్తున్నారు. వరద ఉధతి మరింత పెరిగితే కె.ఏనుగుపల్లి, శివాయి లంక, నాగులంక గ్రామాలు వరద ముంపునకు గురయ్యే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు కోనసీమ జిల్లా సరిహద్దులో ఉన్న పశ్చిమగోదావరి జిల్లాకి చెందిన కనకాయలంక గత రెండు రోజుల నుంచి జలదిగ్బంధంలో చిక్కుకోవడంతో నాటు పడవలపై రాకపోకలు సాగిస్తున్నారు అప్పనపల్లి బాల బాలాజీ శానఘట్ట పూర్తిగా జలదిగ్బంధములో చిక్కు కుంది. పాసర్లపూడి లంక శ్రీరాంపేట వరద ప్రభావిత ప్రాంతంలో లూటుకుర్రు పిహెచ్‌సి ఆధ్వర్యంలోశు క్రవారం వైద్య శిబిరం నిర్వహించారు. ఎంపిడిఒ కుసుమ వెంకటేశ్వరరావు, ఇఒపిఆర్‌డి అడబాల శ్రీనివాసరావులు సందర్శించారు.. అవసరమైన వారికి వైద్య పరీక్షలు చేసి, మందులు అందచేశారు. కార్యక్రమం లో సర్పంచ్ తెలగారెడ్డి సూర్యప్రకాశ్ రావు, హెల్త్ అసిస్టెంట్ ఏడిద కవీంద్ర, ఆశ వర్కర్ పద్మ తదితరులు సేవలందించారు **కపిలేశ్వరపురం:** మండలంలోని నదీ ప్రవాహ ప్రాంతాలైన కేదార్లంక, నారాయణలంక, వీధి వారిలంక, అద్దంకి వారి లంక, పల్లపులంక, కోరుమిల్లి, కపిలేశ్వరపురం, తాతపూడిలో గోదావరి వరద ఉధృతి కొనసాగింది. లంక గ్రామాల్లో పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేయడంతో పాటు మండల స్థాయి అధికారులను, సిబ్బందిని నియమించడం జరిగిందని వరదల పట్ల ప్రజలను అప్రమత్తం చేస్తున్నట్లు మండల తహశీల్దార్ పి.చిన్నారావు తెలిపారు.

ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు బహూకరించిన బీరువా

పాఠశాలకు బీరువా బహూకరణ

ప్రజాశక్తి-రామచంద్రపురం
కె.గంగవరం మండలం శివల గ్రామంలో గల ఎస్‌సి ఏరియా ప్రభుత్వ పాఠశాల్లో బలుసు సత్యనారాయణ జ్ఞాపకార్థం ఆయన కుమారులు బలుసు శ్రీనివాసరావు, రైతు అధ్యక్షులు శివ ప్రసాద్ ఐరన్ సేఫ్ బీరువా శుక్రవారం బహూకరించారు. పాఠశాలలో రికార్డులు భద్రపరుచుకునేందుకు ఇది పయోగపడుతుందని ఈ సందర్భంగా ఉపాధ్యాయులు దాతలను అభినందించారు. ఈ సందర్భంగా శివప్రసాద్ మాట్లాడుతూ గ్రామంలో సమస్యలను గుర్తించి మంత్రి సుభాష్ దష్టికి తీసుకువెళ్లి సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో స్కూల్ కమిటీ ఛైర్మన్ నన్నపు ప్రసాద్, హెచ్ఎం టేకు శ్రీనివాసరావు, గ్రామస్తులు, యువకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అవగాహనా సదస్సు

ప్రజాశక్తి-ఆత్రేయపురం
ఆత్రేయపురం మహర్షి విద్యానికేతన్‌లో శుక్రవారం విద్యార్థులకు రావులపాలెం సిఐ సిహెచ్.విద్యాసాగర్ గుడ్‌టచ్-బ్యాడ్ టచ్, మహిళల పట్ల జరిగే నేరాలు, భద్రత, సైబర్ నేరాలు, ఆర్థికమైన నేరాలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. విద్యార్థులు ఏ విధంగా అప్రమత్తంగా ఉండాలని మరియు మత్తు పానీయాలు సేవించడం వలన ఏ నష్టాలు కలుగుతాయో తెలియజేశారు. హెల్మెట్ ధరించడం వలన జరిగే ఉపయోగాలు తెలియజేశారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడారు. కార్యక్రమంలో ఆత్రేయపురం ఎస్ఐ ఎస్.శ్రీనివాసు, ప్రిన్సిపల్ రామరాజు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పత్రికల్లో 'ప్రజాశక్తి'ది ప్రత్యేక స్థానం

రాజోలు ఎంఎల్ఎ దేవ వరప్రసాద్

ప్రజాశక్తి ప్రత్యేక సంచిక ఆవిష్కరణలో ఎంఎల్ఎ

ప్రజాశక్తి-రాజోలు
నేటి సమాజంలో ఉన్న పత్రికల్లో ప్రజాశక్తిది ప్రత్యేక స్థానమని రాజోలు ఎంఎల్ఎ దేవ వరప్రసాద్ కొనియాడారు. ప్రజాశక్తి 44వ వార్షికోత్సకం సందర్భంగా ముద్రించిన ప్రత్యేక సంచికను శుక్రవారం మలికిపురంలో ఎంఎల్ఎ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిజాలను నిర్భయంగా రాస్తూ ప్రజా సమస్యలను అధికారులు, ప్రజా ప్రతినిధుల దష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తోందని అన్నారు. ప్రజలు బాగు పడాలనే లక్ష్యంతో, వారిని చైతన్యవంతం చేస్తూ ముం దుకు సాగుతోందన్నారు. 44 ఏళ్ల పాటు నిరంతరాయంగా ముందుకు సాగడం అభినందనీయం అన్నారు. ప్రజలు, ప్రభుత్వాల మధ్య సంబంధాలను మెరుగు పరచడంలో పత్రికలు కీలక పాత్ర పోషించాలని అన్నారు. ప్రతి రాజకీయ పార్టీకి ఒక పత్రిక ఉన్న నేటి రోజుల్లో 'ప్రజాశక్తి'కి ఒక ప్రత్యేక స్థానం ఉందని అన్నారు. స్వాంతత్ర్య ఉద్యమంలో కూడా పత్రికలు కీలక పాత్ర పోషించాయి అని అన్నారు. పత్రికలు ప్రజలను చైన్యవంతం చేసి ప్రజా స్వామ్యాన్ని కాపాడాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ప్రజాశక్తి కన్వీనర్ పావన మూర్తి, జనసేన నాయుకులు పెదకాపు, డివిజన్ ఇన్‌ఛార్జి భీమేష్, విలేకరి పి.రాజశేఖర్ పలువురు పాల్గొన్నారు.

విజయవాడ వరద బాధితులకు సాయం

విజయవాడలో నిత్యావసరాలు అందిస్తున్న మంత్రి సుభాష్

పి.గన్నవరంలో నిత్యావసరాల వాహనాలను జెండా ఊపి ప్రారంభిస్తున్న ఎంఎల్ఎ గిడ్డి

ప్రజాశక్తి-యంత్రాంగం
విజయవాడ వరద బాధితుల కోసం డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాలో పలువురు నిత్యావసరాలను, బియ్యం, కూరగాయలు, తదితర వస్తువులను శుక్రవారం అందజేశారు. వీటిని వాహనాల్లో విజయవాడకు తరలించారు. పలువురు విజయవాడ వెళ్లి వరద బాధితులకు వీటిని అందజేసి సహాయక చర్యల్లో పాల్గొన్నారు.
అమలాపురం: విజయవాడ వరద బాధితులకు సిఎం చంద్రబాబు పిలుపు మేరకు అమలాపురం మున్సిపాలిటీ రెండో వార్డుకు చెందిన పులిమే రాజారావు కుమారుడు రూ.5 లక్షల ఖర్చుతో నిత్యావసర వస్తువులు, బియ్యం, కూరగాయలు, కిరాణా సరుకుల సమకూర్చారు. వీటిని రాష్ట్ర మంత్రి వాసంశెట్టి సుభాష్, టిడిపి నాయకులు గంధం పల్లంరాజు, మాజీ మున్సిపల్ ఛైర్మన్ చిక్కాల గణేష్ , మాజీ మున్సిపల్ కౌన్సిలర్ ఆశెట్టి ఆదిబాబు, టిడిపి నాయకులు యిండుగుల ఆనంద్ ఆధ్వర్యంలో రాజారావు కుమారుడు సిద్ధు ఇంటింటికీ నిత్యావసరాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పులిమే సిద్ధు ని పలువురు ప్రత్యేకంగా అభినందించారు.

బాధితులకు అండగా ఎంఎల్ఎ గిడ్డి
మామిడికుదురు: విజయవాడ వరద బాధితులకు పి.గన్నవరం ఎంఎల్ఎ గిడ్డి సత్యనారాయణ అండగా నిలిచారు ఆయన సొంత ఖర్చులు తో సమకూర్చిన నిత్యావసర సరుకులతో కూడిన వాహనాలను పి.గన్నవరం క్యాంపు కార్యాలయం వద్ద శుక్రవారం జెండా ఊపి ప్రారంభించారు నియోజకవర్గానికి చెందిన కూటమి కార్యకర్తల ద్వారా వరద బాధితులకు నిత్యావసర సరుకులు అందం చేస్తామన్నారు. పెదపట్నంలంక షకీనా పెయిత్ హోమ్ నిర్వాహకులు ఇంటి రాజేష్ బాబు ఆధ్వర్యంలో 200 మంది వరద బాధితులకు నిత్యావసర సరకులతోపాటు దుప్పట్లు సేవకుల సహాయంతో అందజేస్తున్నట్లు తెలిపారు.

సమస్యలు పరిష్కరించాలని ఎంఎల్ఎకు వినతి

ఎంఎల్ఎ బండారును సత్కరిస్తున్న బట్టీల సంఘం

ప్రజాశక్తి-ఆలమూరు
చొప్పెల ఇటుక బట్టీల సంఘం ఆధ్వర్యంలో కొత్తపేట ఎంఎల్ఎ బండారు సత్యానందరావును కలిసి ఇటుక పరిశ్రమలో సంక్షోభాన్ని పరిష్కరించాలని శుక్రవారం వినతిపత్రం అందజేశారు. గత వైసిపి ప్రభుత్వంలో తమ సమస్యలపై ఎన్నిసార్లు గోడు వినిపించినా పరిష్కార మార్గం చూపలేదని ఎంఎల్ఎ వద్ద సంఘ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం అధికారం రావడంతో తమ సమస్యలకు పరిష్కారం దొరుకుతుందనే నమ్మకం ఉందన్నారు. అందుకే తమ ఆవేదనను ఎంఎల్ఎ సత్యానందరావుకు విన్నవించామని బట్టీ సంఘం తెలిపింది. ఎంఎల్ఎ సత్యానందరావు సానుకూలంగా స్పందించారని, సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తాననిహామీ ఇచ్చారన్నారు. అనంతరం ఎంఎల్ఎ సత్యానంద రావును దుశ్శాలువా, పుష్పగుచ్ఛ ంతో బట్టీ సంఘ సభ్యులు సత్కరించారు. ఈ కార్యక్రమంలో మెర్ల గోపాలస్వామి, బల్ల హరి, సుకుమల్ల రాముడు, ఆకుల అన్నవరం, జాంపోలు వెంకట్రావు, జాంపోలు నాగేశ్వరరావు, తోరాటి సుబ్రహ్మణ్యం, తదితరులు పాల్గొన్నారు.

కార్టూ'నిజం'

ఇసుక రవాణా వాహనాలకు ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్

జిల్లాస్థాయి ఇసుక కమిటీ సమావేశంలో
జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్

ప్రజాశక్తి-అమలాపురం
ఇసుక రవాణా కోసం ఉపయోగించే వాహనాలను తప్పనిసరిగా ఆన్లైన్లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ తెలిపారు. శుక్రవారం అమలాపురం కలెక్టరేట్లో జిల్లాస్థాయి ఇసుక కమిటీ, జాతీయ హరిత ట్రిబ్యునల్ తీర్పులు అమలు చేసే అంశాలపై సమావేశాలు జరిగాయి. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఇసుక నిల్వ కేంద్రాలు, ఇసుక రీచ్ ల నుంచి ఇసుకను రవాణా చేసే వాహనాలను తప్పనిసరిగా ఆన్లైన్లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. చిన్న వాగులు వంకలు కాలువలలో గ్రామపంచాయతీ పనులు, వ్యక్తిగత నిర్మాణాల కోసం ఇసుకను మనుషులతో తవ్వుకొని ఎడ్లబండల్లో రవాణా చేసుకోవచ్చని కానీ ఇసుకను నిల్వ చేసి విక్రయించకూడదన్నారు. జిల్లాలోని డీసిల్టేషన్ పాయింట్ల వద్ద ట్రాక్టర్లు లారీలతో ఇసుక అక్రమ రవాణా జరగకుండా అవసరమైన చోట్ల పోలీసులు చెక్ పోస్ట్ లు ఏర్పాటు చేయాలన్నారు. జిల్లాలో గుర్తించిన కొన్ని ఇసుక రీచులకు కాలుష్య నియంత్రణ మండలి నుంచి అనుమతులు రాలేదని.. అనుమతుల కోసం సంబంధిత అధికారులకు డిఒ (డెమి అఫీషియల్) లెటర్లు పంపాలన్నారు. డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా పరిధిలోని సర్ ఆర్థర్ కాటన్ బ్యారేజ్ మీద రోడ్డు మరమ్మతు పనులకు జిల్లా మినరల్ ఫండ్ నుంచి రూ.35 లక్షలు మంజూరు చేశామన్నారు. వర్క్ ఆర్డర్ ఇవ్వాలని మైన్స్ అధికారులకు సూచించారు. తాతపూడి, కపిలేశ్వరపురం ఇసుక నిల్వ కేంద్రాల్లో గోదావరి వరదల కారణంగా కొంతమేర ఇసుక కోతకు గురైందని రెవెన్యూ అధికారులు నివేదించిన నేపథ్యంలో గోదావరి హెడ్ వర్క్స్ డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సంబంధిత ప్రాంతాలను పరిశీలించి వారం రోజుల లోపు నివేదిక సమర్పించాలన్నారు. అనంతరం జాతీయ హరిత ట్రిబ్యునల్ జారీ చేసిన ఉత్తర్వులు అమలు చేసే అంశంపై చర్చించారు. జిల్లాలో అనధికారికంగా నిర్వహిస్తున్న చేపలు రొయ్యల చెరువులను గుర్తించి సూచించిన ప్రొఫార్మాలో నివేదిక సమర్పించాలన్నారు. లైసెన్సులు లేకుండా నిర్వహిస్తున్న చెరువులను గుర్తించడానికి గ్రామ, మండల స్థాయిలో బందాలు ఏర్పాటు చేసి సర్వే చేస్తామన్నారు. గ్రామస్థాయిలో గ్రామ ఫిషరీస్ అసిస్టెంట్, వీఆర్వో, గ్రామ సర్వేయర్, ఎనర్జీ అసిస్టెంట్, ఇరిగేషన్ సిబ్బంది తో ఐదుగురితో కూడిన బందాన్ని ఏర్పాటు చేసి అనధికారికంగా నిర్వహిస్తున్న చేపల రొయ్యల చెరువులను గుర్తించి 14 రోజుల్లో నివేదిక సమర్పించా లన్నారు. ఈ సర్వే ఎలా జరుగుతుందన్న అంశంపై ప్రతి మూడు రోజులకు ఒకసారి టెలి కాన్ఫరెన్స్ నిర్వహిస్తామన్నారు. సముద్ర తీరాల్లో ఇసుకను తవ్వుతున్నారని ఫిర్యాదులు వస్తున్న నేపథ్యంలో మైన్స్ రెవెన్యూ అధికారులు ఆయా ప్రాంతాలను పరిశీలించి నివేదిక సమర్పించాలన్నారు.ఈ కార్యక్రమంలో జెసి టి.నిషాంతి, రామచంద్రాపురం అమలాపురం రెవెన్యూ డివిజనల్ అధికారులు ఎన్. సుధాసాగర్, జి కేశవర్ధన్ రెడ్డి, మైన్స్ రాయల్టీ ఇన్‌స్పెక్టర్ వి.సుజాత, ధవళేశ్వరం హెడ్ వర్క్స్ ఇఇ విశ్వేశ్వరరావు, కాలుష్య నియంత్రణ మండలి ఇఇ సందీప్ రెడ్డి, జిల్లా రవాణా అధికారి అశోక్ ప్రతాప్ జెడి ఫిషరీస్ ఎన్.శ్రీనివాస్, ఎపిఇపిడిసిఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రవికుమార్, జిల్లా స్థాయి ఇసుక కమిటీ సభ్యులు, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్లలో చవితి సందడి

విక్రయిస్తున్న పూలు తదితర సామగ్రి

ప్రజాశక్తి-రావులపాలెం
వినాయక చవితిని పురస్కరించుకుని మార్కెట్లు కళకళలాడుతున్నాయి. కోనసీమ ముఖద్వారం రావులపాలెంలోని ప్రధాన రహదారులన్నీ పూజా సామగ్రి దుకాణాలతో రద్దీగా మారాయి. జాతీయ రహదారి సర్వీస్ రోడ్లతో పాటు, రింగ్ రోడ్డు, మార్కెట్ రోడ్లపై వినాయక ప్రతిమలు, పత్రి, పూలు, పండ్లు, పాలవెల్లుల విక్రయాలు జోరుగా సాగాయి. ఉదయం నుంచే చిరు వ్యాపారులు రోడ్ల పక్కన దుకాణాలు ఏర్పాటు చేసుకుని అమ్మకాలు ప్రారంభించారు. అయితే పూలు, పండ్లు, పూజా సామగ్రి ధరలు ఆకాశాన్నంటడంతో భక్తులు వినాయక వ్రతం కోసం భారీగానే ఖర్చుచేయాల్సి వచ్చింది.

నేరాలు ఘోరాలు

పేకాట ఆడుతున్న ఆరుగురు అరెస్ట్

ప్రజాశక్తి - సీతానగరం

పేకాట ఆడుతున్న ఆరుగురిని పోలీసులు అరెస్టు చేసి కేసు నమోదు చేశారు. సీతానగరం ఎస్‌ఐ రామ్‌కుమార్ ఆధ్వర్యంలో పేకాట స్థావరాలపై రెండురోజులుగా దాడులు నిర్వహిస్తున్నారు. శుక్రవారం ఉదయం పురుషోత్తపట్నం విద్యుత్ సబ్ స్టేషన్ సమీపంలో నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై దాడి చేసి ఆరుగురిని అరెస్టు చేశారు. వారి నుంచి రూ.6,620 నగదు, పేక ముక్కలను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి, కోర్టులో హాజరు పరుస్తామని ఎస్‌ఐ రామ్‌కుమార్ తెలిపారు.

ఇద్దరు యువకుల అనుమానాస్పద మృతి

ప్రజాశక్తి - తాళ్ళరేవు

మండలంలోని జి.వేమవరం పంచాయతీ అడవిపూడి గ్రామంలో శుక్రవారం ఇద్దరు యువకులు అనుమానాస్పదంగా మృతి చెందినట్లు కోరంగి ఎస్‌ఐ పి.సత్యనారాయణ తెలిపారు. పెదపూడి మండలం ఏపీ త్రయం గ్రామానికి చెందిన గుర్రాన్ని భవాని కిషోర్(22), పెనుగొండకు చెందిన షేక్ ఇషాక్(22) ఇద్దరూ స్నేహితులు. వీరు అడవిపూడి గ్రామంలోని కోళ్ల ఫారంలో గత కొంతకాలంగా కార్మికులుగా పని చేస్తున్నారు. కాగా గురువారం విధులకు వచ్చిన ఇద్దరు కోళ్ల ఫారంలో ఉరి వేసుకుని విగత జీవులుగా కనిపించడంతో కోళ్ల ఫారం నిర్వాహకుడు శుక్ర వారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కిషోర్ జీవితంపై విరక్తితో ఉరివేసుకుని మృతి చెందగా, అతన్ని చూసి చలించి ఇషాక్ కూడా మృతి చెంది ఉండవచ్చునని భావిస్తున్నట్లు ఎస్ఐ తెలపారు. అనుమానాస్పద కేసుగా నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెల్లడించారు.

రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలు

ప్రజాశక్తి - ముమ్మిడివరం

విధులు ముగించుకుని అమలాపురం నుంచి మోటార్ సైకిల్ పై కాకినాడ వెళుతున్న ఇద్దరు ఎఆర్ కానిస్టేబుల్స్‌ను ఎదురుగా మోటార్ సైకిల్‌పై వస్తున్న ఇద్దరు యువకులు ఢీ కొట్టారు. ఈ ప్రమాదంలో నలుగురు గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. స్థానిక టిడిపి కార్యాలయం సమీపంలో కాకినాడకు చెందిన ఎఆర్ హెడ్ కానిస్టేబుల్ ఎం.సత్యనారాయణ, కానిస్టేబుల్ పి.మణికంఠకుమార్ విధులు ముగించుకుని మోటార్ సైకిల్‌పై కాకినాడ వెళుతున్నారు. ఇదే సమయంలో యానాం నుంచి మోటార్ సైకిల్ పై అమలాపురం వైపు వెళుతున్న మామిడికుదురుకు చెందిన కుంచే ప్రశాంతకుమార్, అతని స్నేహితుడు ఏలూరుకి చెందిన పెరుమళ్ళ విజయ్ ఎదురుగా వస్తున్న బైక్‌ను ఢికొట్టారు. ఈ ప్రమాదంలో గాయపడిన కానిస్టేబుల్స్‌ను అమలాపురం కిమ్స్‌కు తరలించారు. అక్కడ నుంచి మెరుగైన వైద్య సేవల కోసం కాకినాడ అపోలో ఆసుపత్రికి తరలించారు. ఇదే ప్రమాదంలో గాయపడిన ఇద్దరు యువకులను ముమ్మిడివరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఎస్ఐ జ్వాలాసాగర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పురుగుల మందు తాగిన వ్యక్తి మృతి

ప్రజాశక్తి - ఆత్రేయపురం

మద్యానికి బానిసై మనస్థాపంతో పురుగుల మందు తాగిన వ్యక్తి చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో శుక్రవారం మృతి చెందాడు. పోలీసుల వివరాలు ప్రకారం.. మండలంలోని ర్యాలీ గ్రామానికి చెందిన మెర్ల సత్తియ్య(53) కూలి పని చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఇటీవల కాలంలో మద్యానికి బానిస అయ్యాడు. ఈ నేపథ్యంలో గురువారం మద్యం తాగి ఇంటికి రావడంతో భార్య మందలించింది. దీంతో మన స్థాపానికి గురియైన సత్తియ్య పొలంలోకి వెళ్లి పురుగుల మందు తాగి వాంతులు చేసుకున్నాడు. వెంటనే అతనిని రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఎస్ శ్రీనివాస్ తెలిపారు.

'సురుచి' ఒకరోజు అమ్మకాలు విరాళం

కడియం : సేవా కార్యక్రమాలు నిర్వహించడంలోనూ, విపత్తులప్పుడు స్పందించడంలోనూ ముందువరుసలో ఉండే తాపేశ్వరం సురుచి ఫుడ్స్ అధినేత, విద్యా దాత పోలిశెట్టి మల్లిబాబు విజయవాడ వరద బాధితులను ఆదు కునేందుకు ఓ వినూత్న ఆలోచనతో ముందుకు వచ్చారు. ఇప్పటికే 'కృష్ణ'కు 'గోదావరి'కి సహాయం పేర వరద బాధితులకు 2 వేల బ్రెడ్స్, 1,150 క్రీమ్ బన్స్, జామ్, పికిల్స్ అందించ,ఆరు. తాజాగా తమకు గల ఏడు ఫుడ్ బ్రాంచీలలో ఈనెల 8న జరిగే అమ్మకాల మొత్తాన్ని సిఎం సహాయ నిధికి ఇచ్చేందుకు సిద్ధపడ్డారు. ఇందుకు సంబంధించిన వివరాలను ఆయన శుక్రవారం మీడియాకు వెల్లడించారు. గతంలో 2018 లో కూడా కేరళ వరద బాధితులకు ఇలాంటి సాయాన్నే అందించామన్నారు. అప్పట్లో సురుచికి 3 శాఖలే ఉండేవని, ఇప్పుడు మొత్తం 7 బ్రాంచీలు ఉన్నాయన్నారు. ఈ 7 బ్రాంచీలలో ఆదివారం నాటి మొత్తం అమ్మకాలు వరద బాధితుల కోసం ఇవ్వనున్నట్లు చెప్పారు. ఆ ఒక్క రోజూ సురుచి బ్రాంచిల వద్ద ప్రజలు స్వీట్లు హాట్లు, బ్రెడ్లు కొనుక్కుని తింటే డబ్బు మాత్రం విజయవాడ వరద బాధితులకు చేరుతుందన్నారు. దీనికి సహకరించాలని కోరారు.

వరద బాధితుల కోసం సాయం

కడియం : విజయవాడ వరద బాధితుల సహాయార్థం ది ఆలమూరు తాలూకా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ రూ.5 లక్షలు, మండపేట ఛాంబర్ ఆఫ్ కామర్స్ రూ.1.50 లక్షలు, మండపేట రోటరీ క్లబ్ రూ.70వేలను అందించారు. ఈ చెక్కులను మండపేట టిడిపి కార్యాలయంలో ఎంఎల్ఎ వేగుళ్ల జోగేశ్వరరావుకు శుక్రవారం అందజేశారు. ఈ సంధర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ విజయవాడ వరద బాధితులకు సాయం అందించిన వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ప్రతి ఒక్కరూ ముందుకొచ్చి తమ వంతు ఆర్థిక సాయం అందించాలన్నారు.

అవార్డులు బాధ్యతలను పెంచుతాయి...

తాళ్లపూడి : అవార్డులు బాధ్యతను మరింత పెంచుతాయని ఎపిటిఎఫ్ జిల్లా అధ్యక్షులు దున్నా దుర్గారావు అన్నారు. జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా అవార్డు పొందిన మండలంలోని వేగేశ్వరపురం ఉపాధ్యాయురాలు సుభాషిణి, అన్నదేవరపేట ఉపాధ్యాయురాలు పద్మ సుజాతలను ఎపిటిఎఫ్ ఆధ్వర్యంలో శుక్రవారం సన్మానించారు.

ఆదిత్యలో పర్సనాలిటీ డెవలప్‌మెంట్‌పై అవగాహన సదస్సు

ప్రజాశక్తి - గండేపల్లి

మాట్లాడుతున్న మానసిక వైద్య నిపుణులు సుధీర్‌కుమార్

సూరంపాలెం ఆదిత్య గ్లోబల్ బిజినెస్ స్కూల్‌లో విద్యార్థులకు పర్సనాలిటీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మానసిక వైద్య నిపుణులు సాంద్ర సుధీర్ కుమార్ పాల్గొని మాట్లాడుతూ ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థులు ఉన్నతంగా రాణించాలంటే కష్టపడి చదవడాన్ని అలవర్చుకోవాలని అన్నారు. లక్ష్యాలను నిర్దేశించుకుని ఆ లక్ష్య సాధనకోసం నిరంతరం కృషి చేయాలన్నారు. లక్ష్యాలను సాధించాలంటే ఆంగ్ల భాషపై పట్టుసాధించాలని సూచించారు. కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎస్.సుగుణ రెడ్డి మాట్లాడుతూ తమ కళాశాలలోని విద్యార్థులకు కేవలం పుస్తక పరిజ్ఞానంతోపాటుగా ఇటువంటి పర్సనాలిటీ డెవలప్‌మెంట్ కార్యక్రమంలో భాగస్వాములను చేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సంజయ్‌కుమార్, వైస్ ప్రిన్సిపల్ ఎ.విజయభార్గవి, మేనేజ్‌మెంట్ విభాగాధిపతి ఎం.గోవర్ధన్‌రెడ్డి, మాట్లాడారు.

ముగిసిన ఎన్ఎస్ఎస్ ప్రత్యేక సేవా శిబిరం

ప్రజాశక్తి - కరప

కాకినాడ గవర్నమెంట్ నర్సింగ్ కాలేజ్ బిఎస్‌సి నర్సింగ్ విద్యార్థుల ఆధ్వర్యంలో నాలుగు రోజులపాటు నిర్వహించిన ఎన్ఎస్ఎస్ ప్రత్యేక సేవా శిబిరం శుక్రవారంతో ముగిసింది. ఈ సందర్భంగా స్థానిక చంద్రన్న సమావేశ మందిరంలో జరిగిన ముగింపు సభలో ఎంపిడిఒ కొంకి అప్పారావు పాల్గొని మాట్లాడారు. విద్యను అభ్యసించడమే కాకుండా సామాజిక సేవల్లోనూ భాగస్వాములు కావడం లక్ష్యంగా పెట్టుకోవాలని అన్నారు. నర్సింగ్ కాలేజ్ ప్రిన్సిపల్ డాక్టర్ ఎం. మునిరత్నమ్మ మాట్లాడుతూ ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో కరపలో ఆరోగ్యం, పరిశుభ్రతలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలతోపాటు, హెల్త్ క్యాంపులు నిర్వహించినట్లు చెప్పారు. గ్రామ సర్పంచ్ సావే ఆశాజ్యోతి చేతుల మీదుగా సేవలం దించిన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ మాధవి, ఎఐ భాస్కర్‌రావు, టిడిపి మండలాధ్యక్షుడు వెంకటేశ్వరరావు, మండల మహిళా అధ్యక్షురాలు వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

తక్షణమే సస్యరక్షణ చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - పెద్దాపురం

ముంపు నుంచి బయటపడ్డ పొలాల్లో సస్యరక్షణే ప్రధానమని పెద్దాపురం వ్యవసాయ పరిశోధన స్థానం అధిపతి డాక్టర్ ఎం.రామభద్రరాజు అన్నారు. శుక్రవారం పరిశోధనా స్థానంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలకు చెందిన ముఖ్య వ్యవసాయాధికారులతో నిర్వహించిన 'శిక్షణ - సందర్శన' కార్యక్రమానికి ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. వరి, మొక్కజొన్న, పత్తి పంటలు కొద్దిమేర ముంపు నుంచి తేరుకున్నందున ఈ పొలాల్లో చీడపీడలను గమనించి సమగ్ర సస్య రక్షణ చర్యలు చేపడితే పంటలలో స్థిరమైన దిగుబడులు సాధించవచ్చన్నారు. గుంటూరు ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఎస్ రాజమణి ప్రత్తిలో యాంత్రీకరణపైనా, డాక్టర్ ఎం.రవీంద్రారెడ్డి జీవన ఎరువుల వినియోగంపైనా, డాక్టర్ బి.సహదేవరెడ్డి వాతావరణ అనుకూల వ్యవసాయ విధానాలపైనా, ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు డాక్టర్ చల్లా వెంకటనరసింహారావు, డాక్టర్ ఎస్.దయాకర్, డాక్టర్ ఎం.నందకిషోర్ జిల్లాల్లోని పంటల స్థితిగతులపై, చీడపీడల సస్యరక్షణ, ఎలుకల నివారణపై వ్యవసాయాధికారులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన వ్యవసాయాధికారులు బికే. మల్లికార్జునరావు, బివిఎస్‌సి.హరి, రాజశేఖర్, వెంకట నరసింహారావు పాల్గొన్నారు..

ప్రతి మంగళవారం జనవాణి : సువర్ణరాజు

ప్రజాశక్తి - నల్లజర్ల

నియోజకవర్గంలో ఇక నుంచి ప్రతి మంగళవారం జనవాణి కార్యక్రమాన్ని నిర్వహిస్తామని జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి దొడ్డిగర్ల సువర్ణరాజు తెలిపారు. శుక్రవారం ఆవుపాడులో ఆ పార్టీ జిల్లా కార్యదర్శి అచ్యుత సత్యనారాయణ ఆధ్వర్యంలో నిర్వహించిన విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజలనుంచి అర్జీలు స్వీకరించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. విజయవాడ వరద బాధితులకు జనసేన తరుపున ప్రతి గ్రామం నుంచి బియ్యాన్ని సేకరించాలన్నారు. 10 టన్నుల రైస్‌ను అందించాలని నిర్ణయించారు. గ్రౌండ్ లెవెల్‌లో వర్క్ చేసిన జన సైనికునికి జ్ఞాపికలు అందించారు. ఈ కార్యక్రమంలో జనసేన మండల అధ్యక్షులు సోడసాని బాపిరాజు, సీనియర్ నాయకులు అనిశెట్టి గంగరాజు, సనారీ , వివిధ మండలాల అధ్యక్షులు కాట్నం గణేష్, దాకారపు నరసింహమూర్తి, పోలినాటి రాజేంద్ర పాల్గొన్నారు.

ప్రగతి నర్సింగ్ హోమ్‌పై దాడి

ప్రజాశక్తి-రావులపాలెం

రావులపాలెం సరిహద్దులో గల ప్రగతి నర్సింగ్ హోమ్‌పై దాడి చేసి ఆసుపత్రిలో డాక్టర్లను గాయపరచిన వ్యక్తులను అరెస్టు చేసి మశిక్షించాలని డాక్టర్లు, ఆస్పత్రి సిబ్బంది డిమాండ్ చేశారు. శుక్రవారం రావులపాడులో గల ప్రయివేటు ఆసుపత్రి ప్రగతి నర్సింగ్ హోమ్‌పై కొందురు వ్యక్తులు డాక్టర్లను, ఒపి పేషంట్‌ను వెంటపెట్టుకొని వచ్చిన వ్యక్తిపై దాడి చేశారని వైద్యులు తెలిపారు. ఆసుపత్రి పరికరాలు అద్దాలు ధ్వంసం చేసి బెరించారన్నారు. ఘటన కు పాల్పడిన వ్యక్తులను శిక్షించాలని నిరసన తెలిపారు. పోలీసులకు సమాచారం అందడంతో ఘటనా స్థలానికి ఎస్ఐ, సిబ్బంది చేరుకున్నారు. అయితే దాడికి పాల్పడిన వ్యక్తులు పోలీసులను కూడా లెక్కచేయకుండా మీకు పనేంటి అని బెదిరించినట్లు ఆస్పత్రి సిబ్బంది తెలిపారు. ఇంతలో సమాచారం అందుకున్న రావులపాలెంలో మిగిలిన డాక్టర్లు ప్రగతి ఆసుపత్రికి చేరుకొని కర్రి బలరామిరెడ్డి, కర్రి సందీప్‌రెడ్డిల పై దాడిచేసిన వ్యక్తులను అరెస్టు చేసి డాక్టర్లకు రక్షణ కల్పించాలని డిమాండ్‌చేశారు. దాడిచేసిన వ్యక్తులను కఠినంగా శిక్షించి న్యాయం చేయాలని నినాదాలు చేశారు. జరిగిన ఘటన పోలీసు ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లడంతో డిఎస్‌పి, సిఐ ఆసుపత్రికి చేరుకొని డాక్టర్ల వివరణ తీసుకొన్నారు.

క్రమశిక్షణతో లక్ష్యాలను చేరుకోవాలి

ప్రజాశక్తి-ముమ్మిడివరం

గురుకుల పాఠశాల హాస్టల్ విద్యార్థులు క్రమశిక్షణతో చదివి లక్ష్యాలను చేరుకోవాలని ముమ్మిడివరం మండల లీగల్ సర్వీసెస్ కమిటి ఛైర్మన్, జూనియర్ సివిల్ జడ్జి మహమ్మద్ రహంతుల్లా అన్నారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరం జిల్లా కోర్టు ఆదేశాల మేరకు అల్లవరం మండలం గోడిలోని బాలికల, బాలుర గురుకుల పాఠశాలలో గురువారం మేజిస్ట్రేట్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. దీనిలో భాగంగా మెజిస్ట్రేట్ రహంతుల్లా విద్యార్థుల సిలబస్ నుంచి ప్రశ్నలు అడిగి సమాధానాలు తెలుసుకున్నారు. అదే విధంగా హాస్టల్ స్టాక్ రిజిస్టర్, అటెండెన్స్ రిజిస్టర్‌లను పరిశీలించారు. స్టూడెంట్స్ రూమ్స్, విద్యార్థుల సంఖ్యకు సరిపడా బెడ్స్ ఉన్నాయా అని పరిశీలించారు. ఫ్యాన్ లు సరిగా పని చేస్తున్నాయా, కిటికీ డోర్స్‌కి మెష్‌లు ఉన్నాయా, లైట్స్ పని చేస్తున్నాయా, డ్రింకింగ్ వాటర్ ఆర్ఒ ప్లాంట్ పని చేస్తుందా, బాత్ రూమ్స్ సరిపడా ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. స్టోర్ రూమ్, ఆఫీస్ రూమ్,రోడ్లు పరిశీలించారు. వండిన ఆహార పదార్థాలను రుచి చూసి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు.

'గణపతి' ఉత్సవ కమిటీలతో సమావేశం

ప్రజాశక్తి-రామచంద్రపురం

మాట్లాడుతున్న తహశీల్దార్ ఎం. వెంకటేశ్వరరావు

గణపతి నవరాత్రుల సందర్భంగా తహశీల్దార్ ఎం.వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ఉత్సవ కమిటీలతో శుక్రవారం సమావేశం ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ రామచంద్రపురం మండల పరిధిలోని అందరూ పంచాయతీ కార్యదర్శులు, విఆర్ఒలు, మహిళా పోలీసులు గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులతో సమావేశాలు ఏర్పాటు చేసి గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులకు విషయాలను తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో మండల పరిషత్ అధికారి, సిఐ అశోక్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. **ఆత్రేయపురం:** ప్రశాంత వాతావరణంలో చవితి నవరాత్రులు జరుపుకోవాలని రావులపాలెం సిఐ సిహెచ్.విద్యాసాగర్ అన్నారు. శుక్రవారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మండల అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామాల సర్పంచులు పాల్గొన్నారు.

పలు చోట్ల మట్టి గణపతి ప్రతిమల పంపిణీ

ప్రజాశక్తి-యంత్రాంగం

అమలాపురంలో మట్టి విగ్రహాలు పంపిణీ

జిల్లాలో పలుచోట్ల మట్టి గణపతి ప్రతిమలను పలువురు శుక్రవారం పంపిణీచేశారు. **అమలాపురం:** స్థానిక మసిద్ సెంటర్ వద్ద శుక్రవారం అమలాపురం జనసేన పార్టీ నాయకులు జానీ బాషా సేవా సమితి అధినేత షేక్ కరీముల్లా బాబా ఆధ్వర్యంలో వినాయక చవితి పురస్కరించుకొని హిందువులకు ఉచితంగా మట్టి విగ్రహాలను పంపిణీ చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన జనసేన పార్టీ సీనియర్ లీడర్ లింగోలు పండు మొహమ్మద్ బషీర్ తదితరులు పాల్గొన్నారు. **కాట్రేనికోన:** గట్ సెంటర్లో జనసేన పార్టీ సీనియర్ నాయకులు మోకల దుర్గ బాబు ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన 250 మట్టి వినాయకుని విగ్రహాలను టిడిపి రాష్ట్ర కార్యదర్శి నాగిడి నాగేశ్వరరావు చేతుల మీదగా ప్రజలకు ఉచితంగా పంపిణీ చేశారు. **ఆత్రేయపురం:** పర్యావరణ పరిరక్షణ మన అందరి బాధ్యత అంటూ మట్టి వినాయకుని పూజించి పర్యావరణాన్ని కాపాడాలంటూ మండలం ర్యాలి గ్రామంలోని స్థానిక మ్యాజిక్ హౌస్ వద్ద అనూస్ స్వచంద సంస్థ ఆధ్వర్యంలో బంక మట్టి గణపతి ప్రతిమలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో శ్యామ్ జాదూగర్ మ్యాజిక్ ఫ్యామిలీ సభ్యులు పాల్గొన్నారు.

వర్గీకరణపై గ్రామాల వారీ ఆందోళనలు

ప్రజాశక్తి - కాకినాడ

సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా జెఎసి అధ్యక్షుడు సిద్ధాంతుల కొండబాబు

ఎస్‌సి వర్గీకరణపై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు రాజ్యాంగ వ్యతిరేకమని గ్రామాల వారీగా ఆందోళనలు నిర్వహించాలని మాల మహానాడు జెఎసి నాయకులు పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక అంబేద్కర్ భవన్లో ఎస్‌సి వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వర్గీకరణకు వ్యతిరేకంగా పోరాటాన్ని సాగించేందుకు 30 మందితో కాకినాడ జిల్లా జెఎసిని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జెఎసి నాయకులు సిద్ధాంతుల కొండబాబు, ఎ.రామేశ్వరావు, పిట్టా వర ప్రసాద్, పండు అశోక్‌కుమార్, సుబ్బు, ఏనుగుపల్లి కృష్ణ, నూకరాజు మాట్లాడారు. ఎస్‌సి వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పు రాజ్యాంగ విరుద్ధమన్నారు. ఎస్‌సి వర్గీకరణ తీర్పు మాలలకు వ్యతిరేకంగా ఉందని, 11 మంది ధర్మాసనంతో కూడిన బెంచి ఏర్పాటు చేసి తీర్పును పున్ణసమీక్షించాలని డిమాండ్ చేశారు. ప్రతీ గ్రామం నుంచి మాలలు చైతన్యవంతులై పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. మాల ప్రజాప్రతినిధులు సుప్రీంకోర్టులో రివ్యూ పిటీషన వేయాలని సూచించారు. వర్గీకరణ అంశంపై రాజకీయ పార్టీలు రాజకీయాలు చేయడం మానుకోవాలని అన్నారు. ఎస్‌సి రిజర్వేషన్లను 15 శాతం నుంచి 23 శాతం వరకు పెంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మేఘం రాజు, లింగం శివకుమార్ , దారా సురేష్, సుబ్రహ్మణ్యం, కిరణ్, టి.చెంగళ్ రావు పాల్గొన్నారు. మాల మహానాడు జిల్లా జెఎసి అధ్యక్షుడుగా సిద్ధాంతపు కొండబాబు, జిల్లా గౌరవ అధ్యక్షులుగా ఐతాబత్తుల రామేశ్వరరావు, తుమ్మల నూకరాజు, పిట్టా వరప్రసాద్, పండు అశోక్ కుమార్, జిల్లా కన్వీనర్లుగా ఏనుగుపల్లి కృష్ణ, తోటి చెంగల్ రావు, బుంగ సతీష్ కుమార్, మాత సుబ్రమణ్యంలతోపాటు 30 మందిని నియమించారు. ఈ నెల 11న చలో ఢిల్లీ ముట్టడి కార్యక్రమానికి మద్దతుగా కలెక్టరేట్ వద్ద ధర్నా చేయాలని జెఎసి పిలుపునిచ్చింది.

పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

సదస్సులో మాట్లాడుతున్న సిడిపిఒ మాధవి

ప్రజాశక్తి - తాళ్లరేవు

పోషక విలువలు గల ఆహారంతోనే మహిళలు, చిన్నారులకు సంపూర్ణ ఆరోగ్యం సమకూరుతుందని ఐసిడిఎస్ సిడిపిఒ మాధవి అన్నారు. శుక్రవారం స్థానిక బీమాభాయి మహిళా మండలి కార్యాలయంలో మండలి ప్రాజెక్టు డైరెక్టర్ వాసంశెట్టి నందివర్ధన అధ్యక్షతన పౌష్టికాహార వారోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సామాన్య ప్రజలకు అందుబాటులో ఉన్న, తక్కువ ధరకు లభ్యమయ్యే పోషక విలువలు ఎక్కువగా గల ఆహారాన్ని తీసుకోవడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందన్నారు. అన్ని రకాల కాయగూరలు, ఆకుకూరలు, పండ్లు తీసుకోవడం ద్వారా శరీరానికి అవసరమయ్యే అన్ని పోషక విలువలు లభిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ పర్యవేక్షకురాలు నళిని, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పౌష్టికాహార మాసోత్సవాలు

ప్రజాశక్తి - సామర్లకోట

మండంలంలోని హుస్సేన్‌పురంలో పౌష్టికాహార మాసోత్సవాల కార్యక్రమాన్ని నిర్వహించారు. గర్భిణులకు సామూహిక శ్రీమంతాలు చేశారు. ఇంటింటికీ వెళ్లి పరిశరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ప్రజలకు అవగాహన కల్పించారు. అలాగే 2016లో నిర్మించిన ఎన్‌టిఆర్ గృహాలకు సంబంధించి బిల్లులు మంజూరు కాని వారికి సంబంధించి గృహ నిర్మాణ శాఖ సిబ్బంది సర్వే నిర్వహించారు.ఈ కార్యక్రమంలో టిడిపి గ్రామ అధ్యక్షుడు చల్ల బుజ్జి, పంచాయతీ సెక్రెటరీ, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు సత్కారాలు

ప్రజాశక్తి - తాళ్లరేవు

గురుపూజోత్సవం సందర్భంగా ఎంపికైన ఉత్తమ ఉపాధ్యాయులను స్థానిక లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సత్కరించారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలకు చెందిన 10 మంది ఉత్తమ ఉపాధ్యాయులను లయన్స్ క్లబ్ ఎంపిక చేసి శుక్రవారం శాలువాలతో సత్కరించి, మెమోంటోలను అందించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ జిల్లా గవర్నర్ వేలూరి సూర్యనారాయణ, రీజియన్ ఛైర్‌పర్సన్ బిళ్ళకుర్తి శ్రీనివాసరెడ్డి, స్థానిక లయన్స్ క్లబ్ ప్రతినిధులు పొన్నాడ పేరయ్యరాజు, చోడే శ్రీనివాస్, మాలతి వసుంధర, వరప్రసాద్ రెడ్డి, కట్ట ఆదినారాయణ పాల్గొన్నారు.

వాలంటీర్లను కొనసాగించండి

ప్రజాశక్తి - పెద్దాపురం

రాష్ట్రవ్యాప్తంగా గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన వాలంటీర్ వ్యవస్థను కొనసాగించాలని పలువురు వాలంటీర్లు కోరారు. శుక్రవారం టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రాజా సూరిబాబు రాజుకు వారు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వాలంటీర్లు మాట్లాడుతూ గత మూడు నెలలుగా జీతాలు లేకుండా ఖాళీగా ఉంటున్నామన్నారు. ఎన్నికలలో ఇచ్చిన హామీ మేరకు తమకు పని కల్పించి జీతాలు పెంచాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో వాలంటీర్లు ఉల్లి బంగారయ్య, ఎస్‌కె.కరీం, నాగేంద్ర, లలిత, తదితరులు పాల్గొన్నారు.

పోషకాహారంపై అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి - సామర్లకోట

పట్టణంలోని కోటపేట, పెద్దబజార్, గొల్లపేట, బలుసులపేట-1 సెక్టార్‌ల పరిధిలో శుక్రవారం పోషకాహార మాసోత్సవంలో భాగంగా అవగాహన ర్యాలీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిడిపిఒ ఉషా, సెక్టార్ సూపర్‌వైజర్ మంగ పాల్గొని మాట్లాడారు. గర్భినులు, బాలింతలు, తల్లులకు పోషకాహార ప్రాధాన్యత, తల్లిపాలు ప్రాధాన్యత, అదనపు ఆహారం, ఆకుకూరలు, పండ్లు, చిరుధాన్యాల ఉపయోగం, చంటిపిల్లలకు వేసే టీకాలు వంటి వాటిపై అవగాహన కల్పించారు.

గ్రామాల్లో అధికారుల పర్యటన

ప్రజాశక్తి - రౌతులపూడి

మండలంలోని ఉప ప్రణాళిక ప్రాంతమైన రాఘవపట్నం గ్రామపంచాయతీలో గల దబ్బాది, దనబంద, కొత్తూరు గ్రామాల్లో ఎంపిడిఒ ప్రేమ్ సాగర్ శుక్రవారం పర్యటించారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై గిరిజనులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో సమస్యలను స్థానికులను అడిగి తెలుసుకున్నారు. చెల్లూరు రాఘవపట్నం గ్రామాల్లో వ్యవసాయ అధికారి ఈశ్వరరావు పర్యటించి పంటను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

గోశాలలను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి - జగ్గంపేట

ఉపాధి హామీ నిధుల ద్వారా ఏర్పాటు చేస్తున్న గోశాలలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎంఎల్‌ఎ జ్యోతుల నెహ్రూ పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక టిడిపి కార్యాలయంలో నియోజకవర్గ, మండల శాఖ అధికారులతో సమీక్షా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో గోశాలలు నిర్మించుకోవడానికి రైతులకు ముందుకు రావాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పశువుల నివాసం కోసం రైతులు తాటాకులతో పాకలు నిర్మించడం జరుగుతుందని, దీనివల్ల ప్రతి సంవత్సరం తాటాకులు మార్చడానికి ఎక్కువ ఖర్చు పెట్టి రైతుల నష్టపోతున్నారని అన్నారు. అదేవిధంగా అగ్ని ప్రమాదాల బారిన పడి పశువులు చనిపోతున్నాయనే ఉద్దేశ్యంతో రాష్ట్ర ప్రభుత్వం గోకులం షెడ్లు నిర్మించేందుకు అనుమతి ఇచ్చిందన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి - తాళ్లరేవు

వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని గాడిమొగ పిహెచ్‌సి వైద్యులు ఎస్.శ్యామల అన్నారు. చిన్న వలసల గ్రామంలో నిర్వహించిన ఫ్యామిలీ ఫిజిషియన్ ప్రోగ్రాంలో పలువురు రోగులకు ఆమె పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. కాచి, చల్లార్చిన నీళ్లు తాగాలని, డెంగూ, మలేరియా వంటి వ్యాధులు రాకుండా తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్. పి.శిరీష, ఎఎన్ఎం భవాని, ఆశా కార్యకర్తలు దేవి, లీలా భవాని, 104 సిబ్బంది నాగార్జున పాల్గొన్నారు.

పంచాయతీలకు వరద సాయం పట్ల హర్షం

ప్రజాశక్తి - కరప

రాష్ట్రంలో 400 పంచాయతీలకు వరద సాయంగా ఒక్కొక్క పంచాయతీకి రూ.లక్ష చొప్పున డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ వ్యక్తిగతంగా కేటాయించడంపై జనసేన నాయకులు డాక్టర్ బోండ సూర్యారావు హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామపంచాయతీలలో కనీసం బ్లీచింగ్ కొనడానికి కూడా నిధులు లేని పరిస్థితిని గమనించిన పవన్‌కళ్యాణ్ తన సొంత నిధులను కేటాయించడం అభినందనీయమని అన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో కూడా పంచాయతీలకు సొంత నిధులు ఇచ్చిన మంత్రిని మనం చూడలేదని అన్నారు. ఈ నిధులతో పంచాయతీలలో పారిశుధ్య పనులు చేపట్టేందుకు అవకాశం కల్గిందన్నారుఉ. ఈ సమావేశంలో మాజీ వైస్ ప్రెసిడెంట్ దూడల నారాయుడు, మాజీ సర్పంచ్ పోలిశెట్టి తాతీలు, సొసైటీ వైస్ ప్రెసిడెంట్ కోండేపూడి దోరబాబు, బోండ గోవిందు, ఆకుల కృష్ణమూర్తి, ఆకుల శ్రీను పాల్గొన్నారు.

చేతిరాతపై ప్రత్యేక శిక్షణ

ప్రజాశక్తి - సామర్లకోట

చేతిరాత బాగుంటే తలరాత బాగుంటుందని ఎంఇఒలు వై.శివరామకృష్ణయ్య, పి.పుల్లయ్య అన్నారు. శుక్రవారం స్థానిక జడ్‌పి బాలిక ఉన్నత పాఠశాలలో చేతిరాతపై శిక్షణ కార్యక్రమాన్ని వారు ప్రారంభించారు. హైస్కూల్ హెచ్ఎం యు.మీనామాధురి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులతోపాటు, విద్యా శాఖకు చెందిన సిబ్బంది పాల్గొన్నారు.

మొక్కలను పెంచండి పర్యావరణాన్ని కాపాడండి

ప్రజాశక్తి - కోటనందూరు

మొక్కలను నాటి పర్యావరణాన్ని కాపాడాలని టిడిపి సీనియర్ నాయకులు అంకంరెడ్డి బుల్లిబాబు అన్నారు. శుక్రవారం అల్లిపూడి జడ్‌పి హైస్కూల్లో గ్రామీణ ఉపాధి పథకం ద్వారా మంజూరైన మొక్కలను ఆయన నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొక్కల పెంపకంపై విద్యార్థులు ఆశక్తి పెంచుకోవాలని, నాటిన ప్రతీ మొక్కను సంరక్షించేందుకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ వెంకటేష్, ఉపాధ్యాయులు ప్రసాద్ ప్రశాంతి, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర పవర్ లిఫ్టింగ్ పోటీల పోస్టర్ల ఆవిష్కరణ

ప్రజాశక్తి-అమలాపురం

పట్టణంలో ఈ నెల14,15 తేదీల్లో ఆఫీసర్స్ రిక్రియేషన్ క్లబ్ నందు మెట్రోకెమ్ అధినేత డాక్టర్ నందిపు వెంకటేశ్వరరావు సౌజన్యంతో నిర్వహించే 11వ ఎపి పవర్ లిఫ్టింగ్(మెన్ అండ్ ఉమెన్)-2024 పోటీలకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. శుక్రవారం ఎన్‌విఆర్ స్వగహం నందు ఏర్పాటుచేసిన కార్యక్రమంలో డాక్టర్ నందిపు వెంకటేశ్వరరావు ఈ పోస్టర్లను ఆవిష్కరించారు. హెల్త్‌అండ్‌ఫిట్నెస్ జిమ్, కోనసీమ పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో జరిగే ఈ పవర్ లిఫ్టింగ్ పోటీలకు పాల్గొనటానికి ఇప్పటికే 400 మంది పైగా క్రీడాకారులు దరఖాస్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో కోనసీమ పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఎనుముల కృష్ణ పద్మరాజు, సెక్రెటరీ ఒంటెద్దు వెంకన్న నాయుడు, ఉపాధ్యక్షులు గారపాటి చంద్రశేఖర్, నార్ని శీను, పొనకల దుర్గ ప్రసాద్ తదితరులు తెలిపారు.

IN THE COURT OF THE HON'BLE VII ADDITIONAL DISTRICT AND SESSIONS JUDGE: PEDDAPURAM
O.P.72 / 2024

Between:
Dindu Appalaraju
(In the matter of minor Darballa Archana Priyanka who was born on 04-03-2020 ...Petitioner
and
Nill ...Respondent

NOTICE

Take notice that one Dindu Appalaraju, W/o.Satyanarayana, aged 56 years, Home, Maker, resident of D.No.9-42, Kothapeta, Balabhadrapuram Bikkavolu Mandal, Anaparthy Junior Civil Judge Limits filed the petition under reference praying the Hon'ble Court to appoint her as a guardian to the minor ***Daraballa Archana Priyanka, D/o.Late Veera Venkata Ramana Presently aged about 14years, resident of D.No.4-67, Neeladhriraopeta Village in Gandepalli mandal for proper management of properties of minor and also to represent her before various authorities.*** Said Petition stands posted to **16-10-2024** before the Hon'ble VII Additional district and Sessions Judge, Peddapuram. Hence public at large are hereby informed that if any body got any objection regarding the above relieves claimed by the petitioner herein, they have to place those objections before the above referred Hon'ble Court on **16-10-2024** at **10.30.**

Dara Srinivas,
Advocate,Jaggampeta
9848222455.

IN THE COURT OF THE HON'BLE VIII ADDITIONAL DISTRICT JUDGE AT RAJAMAHENDRAVARAM,E.G. DISTRICT
M.V.O.P.NO.619/2024

Between:
Kolli Ramana Kumari ...**Petitioner**
And
The New India Assurance Co.,LTD., and 2 Others ...**Respondents**

R-2: Nemani Rama Krishna S/o. VenkataNarayana ,aged 40 years, Hindu,Male, Owener of the Car Bearing reg.No.**KA51N5143** R/o.D.No.3-16-195/301, Indraprasta Yudhishitra Apartments, Venkat Nagar, Kakinada. East Godavari District -Kakinada DMC.

The 2nd respondent mentioned above may take notice that the above M.V.O.P.filed by the petitioner clairning compensation under M.V.Act, is posted to **20-09-2024** for service of notice by way of peper publication hence the 2nd respondent may take notice that he has to attend the court at **10.30** A.M.on **20-09-2024** and if he fails to attend the court on the said day, he will be set-exparte and the case will be proceeded further in his absence.

C.RAMAKRISHNA
Advocate for the Petitioner
Rajamahendravarm
Rajamahendravaram,
24-08-2024

ఖండన ప్రకటన

కృష్ణ జిల్లా, విజయవాడ, కె.ఎస్.ఆర్.మూర్తి రోడ్డు, డోరు నెం.30-14-13 రు నందు విక్టరీ పబ్లిషర్స్ తరపున ప్రొప్రయిటర్ అయిన ఇమ్మిడిశెట్టి రామ్‌కుమార్ గారి కుమారుడు ఇమ్మిడిశెట్టి నాగ సుకుమార్‌గారు యావన్మందికి యిందుమూలముగా తెలియజేయునది ఏమనగా:

ది. 19-08-2024 సం॥రం తేదీన ప్రజాశక్తి పేపరు నందు గొల్లపూడి వీరాస్వామి పుస్తక ప్రచురణ తరపున ప్రొప్రయిటర్ అయిన శ్రీమతి గొల్లపూడి వెంకట రామలక్ష్మిగారు ఇచ్చిన ప్రకటన నందు పొందుపరచిన అంశములన్నియూ పూర్తిగా అవాస్తవములు మరియు సత్య దూరములు.

సదరు డా॥ యాళ్ళాయి నారాయణరావుగారు వారి జీవిత కాలములో వారి ద్వారా రచించబడిన (1) భవిష్యపురాణము, (2) శివపురాణము మరియు (3) గరుడపురాణముల యొక్క కాపీరైట్ హక్కులను మా సంస్థ గత 11 సంవత్సరములకు పూర్వమే పొంది మా సంస్థ ద్వారా ప్రచురితము అయి ఉన్నవి. కావున, సదరు నారాయణరావుగారి వారసులకు మరలా కాపీరైట్ ఇచ్చే హక్కు చట్టపరముగా లేదు. కావున, మీరు అనగా గొల్లపూడి వీరాస్వామి పుస్తక ప్రచురణవారు మరెవరైనా పైన తెలిపిన రచనలను ప్రచురించిన యెడల ఆ విధమైన చర్య అనేది కాపీరైట్ హక్కులను భంగపరచినట్లుగా భావించి మీ మీద చట్టపరముగా తీసుకొను చర్యలకు మీరు బాధ్యులగుదురని యిందుమూలముగా యావన్మందికి తెలియజేయడమైనది.

ది.06-09-2024 ఇట్లు: **విక్టరీ పబ్లిషర్స్ - ఇమ్మిడిశెట్టి నాగ సుకుమార్**

KAKINADA MUNICIPAL CORPORATION
'e' PROCUREMENT NOTIFICATION

Roc No. 35957/2024/E2 **Dated: 06-09-2024**

Tenders invited through ap e procurement platform for 08 works with an estimated contract value of **Rs. 1,11,52,263/-** from the eligible contractors in the following manner.

Six Works for an amount of Rs. 44,74,774/-

Last date and time for downloading bid documents : Dt.17-09-2024 upto 02-00 PM
Last date and time for submission of bids : Dt.17-09-2024 upto 02-30 PM

Two Works for an amount of Rs. 66,77,489/-

Last date and time for downloading bid documents : Dt.26-09-2024 upto 02-00 PM
Last date and time for submission of bids : Dt.26-09-2024 upto 02-30 PM

Tender Inviting Authority:
Commissioner, Municipal Corporation, Kakinada
Mail: kkd_mplcorp@yahoo.com
Call Centre Phone: 0884-2357722

Further details can be seen at 'e' procurement market place @ www.apeprocurement.gov.in

Sd/- **COMMISSIONER**
MUNICIPAL CORPORATION
KAKINADA